స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలు తోడేస్తున్న **పాలకులు**

ప్రభుత్వం అండతో కుటీర పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా ఇష్టానుసారంగా **తయారీ**

కల్తీ మద్యం, బెల్ట్ షాపులను పాలకులు తక్షణమే అరికట్టాలి

కల్తీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు **కళ్యాణి,**

తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు డి**మాండ్**

కూటమి కల్తీ మద్యానికి జనం బలి



కూటమి పాలకుల అండతో తయారు చేస్తున్న కల్తీ మద్యాన్ని సీసాల నుంచి రోడ్డుపై వేసి నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు



కూటమి పాలకులు విక్రయిస్తున్న కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ప్లకార్డు ప్రదర్శిస్తున్న మహిళలు

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వంలోని పెద్దల అండతో స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మండిపడ్డారు. పాలకుల కనుసన్నల్లోనే కుటీర పరిశ్రమలా మార్చేసి కల్తీ మద్యానికి జనాన్ని బలి చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్ట్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు మూసేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం సభ్యులతో కలిసి సోమవారం భారీ ఆందోళన చేశారు. సిరిపురం సమీపంలోని ప్రొహిబిషన్ – ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి, మొల్లి అప్పారావు మాట్లాడుతూ స్పిరిట్ కలిపి మద్యం తయారు చేసి విక్రయిస్తుండడంతో తాగిన వారు చూపు కోల్పోతున్నారని, ఊపిరితిత్తులు, కాలేయ సమస్యలతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలకులకు దమ్ముంటే కల్తీ మద్యం కుంభకోణం మీద సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 40 వేల బెల్ట్ షాపులను మూయించామని గుర్తు చేశారు. ప్రభుత్వ దుకాణాల్లోనే మద్యం విక్రయిండంతో నియంత్రణ ఉండేదన్నారు.



ప్రొహిబిషన్ - ఎక్సైజ్ శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు

పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారని వరుదు కళ్యాణి, మొల్లి అప్పారావు ఆరోపించారు. కల్తీ మద్యం తాగిన మత్తులో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అండతో సరఫరా చేస్తున్న కల్తీ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కాం జరిగిందని హడావిడి చేసిన కూటమి నాయకులు ఇప్పుడు బయటపడిన కల్తీ మద్యం కుటీర పరిశ్రమలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కల్తీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చేశారని ఆరోపించారు. బడి, గుడి అని చూడకుండా అడుగడుగునా బెల్టుషాపులు ఏర్పాటు చేసి కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ వైన్‌షాప్ వద్ద పర్మిట్ రూములు ఏర్పాటుచేసి, నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ పరిపాలనను వ్యతిరేకిస్తూ..., వెంటనే కల్తీ మద్యం అరికట్టాలని ప్రొహిబిషన్ - ఎక్సైజ్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, పల్లా అప్పలకొండ, కోరుకొండ వెంకటస్వాతి దాసు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముvvల సురేష్, జిల్లా కార్యదర్శి ఉమ్మిడి దాసు, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, పీతల గోవింద్, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శి బెవర జగదీశ్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, తూర్పు మహిళ విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, యువజన విభాగం అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు బేత దుర్గారావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బంగారు భవానీ శంకర్, ప్రచార విభాగం అధ్యక్షుడు సంపంగి సురేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, వార్డు అధ్యక్షులు నీరజ్ కుమార్, పతివాడ కనకరాజు, మొల్లి హేమంత్, మరియదాసు, చొల్లంగి నాగేశ్వరరావు, నీలారెడ్డి, ఉమ్మిడి కళ్యాణ్, యనమరెడ్డి కుమార్ రెడ్డి, మధుపాడ రవి, పీలా జోషీల, పతివాడ వెంకటలక్ష్మి, మండెం పద్మజ, పిల్లా సత్యవతి, నక్కాన సత్యవేణి, పిట్ల వరలక్ష్మి, బేగం, వెంకటలక్ష్మి, సంధ్య, పార్వతి, జగదీశ్వరి, జ్యోతి, శశికళ, భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర తగ్గించి.. కల్తీ మద్యం అమ్మకాలు



న్యాణమైన మద్యం తక్కువ ధరకు విక్రయిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు అందుకు విరుద్ధంగా కల్తీ మద్యాన్ని ధర తగ్గించి అమ్ముతూ రాష్ట్ర ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు. అనేక మంది కల్తీ మద్యం తాగి తక్కువ వయస్సులోనే ప్రాణాలు కోల్పోతు న్నారు. కూటమి నాయకులు ధనార్జనే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పేదల జీవితాలతో దారుణంగా ఆటలాడుతున్నారు.

– పిల్ల సత్యవతి, ఆదర్శనగర్, పెదవాల్తేరు

మహిళల తాళిబొట్లతో వ్యాపారం



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు అధికంగా ఉండడంతో చాలా తక్కువ కొనుగోలు చేసుకుని తాగేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పి... కల్తీ మద్యాన్ని జనంలోకి విపరీతంగా డంప్ చేస్తుండడంతో చాలా మంది ఎక్కువగా తాగుతున్నారు. స్పిరిట్‌తో తయారు చేసిన మద్యం కావడంతో తాగిన వారు ఆస్పత్రి పాలవుతున్నారు. కూటమి పాలకులు మహిళల తాళిబొట్టులతో వ్యాపారం చేస్తున్నారు.

– కృష్ణ కుమారి, పాత డైరీఫారం

కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టాలి



రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల అండదండలతోనే కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసి కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారు. తాగిన వారి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రుల పాలవడంతో చాలా కుటుంబాలు నడి రోడ్డు మీద పడుతున్నాయి. తక్షణమే కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టాలి. జనావాసాలు, స్కూళ్లు, దేవాలయాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులు తొలగించాలి.

– రవణమ్మ, మద్దిలపాలెం

క్లుప్తంగా

ఆరిలోవ రైతుబజార్‌కు ప్రతీ మంగళవారం సెలవు



ఆరిలోవ రైతుబజార్

ఆరిలోవ : జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరిలోవ రైతుబజార్‌కు ప్రతీ మంగళవారం సెలవు ప్రకటించినట్లు రైతుబజార్ ఈవో నాయుడు తెలిపారు. ఇక్కడి 38 స్టాళ్లలో పదింటిని డ్వాక్రా మహిళలకు కేటాయించామని తెలిపారు. వాటి కోసం ఆసక్తి గల డ్వాక్రా మహిళలు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు అవకాశం కల్పించారన్నారు. ఇందులో దివ్యాంగులకు ఒక స్టాల్ కేటాయించారన్నారు. ఇక్కడ స్టాళ్లు అన్నీ కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఆరిలోవకు సమీపంలో ఉన్న ఎంవీపీ రైతు బజార్‌కు బుధవారం సెలవు కావడంతో ఆరిలోవ రైతు బజార్‌కు మంగళవారం సెలవు కేటాయించారని తెలిపారు.

బహుమతులు గెల్చుకున్న విద్యార్థులకు అభినందనలు



యూత్ ఫెస్టివల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులతో ఆచార్యులు

మద్దిలపాలెం : ఏయూ శతాబ్ది వేడుకల్లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి యూత్ ఫెస్టివల్‌లో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, జాతీయ సేవా పథకం యూనిట్ – 2 నుంచి పన్నెండు రంగాల్లో వలంటీర్స్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. అవార్డులు, బహుమతులు అందుకున్న వారిని సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహమూర్తి, ఆచార్య జలాది రవి, బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో ఎక్కడికక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడి పేరుకుపోవడంతో వాటిని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కిషోర్ సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొలగించారు. డాక్టర్స్ కాలనీలో విరిగిన చెట్ల కొమ్మలను, సింహాద్రిపురం ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని కాలనీవాసులను హెచ్చరించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌ల వద్దనే చెత్త వేయాలని సూచించారు.

శ్మశానవాటిక రోడ్డు ఆధునికీకరించాలని వినతి



అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రేమ్ కిరణ్ తదితరులు

ఎంవీపీ కాలనీ : వెంకోజీపాలెం శ్మశాన వాటిక రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామ సేవా సంఘం నాయకులు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్ కిరణ్ ఈ మేరకు సోమవారం జీవీఎంసీ స్పందనకు హాజరై అదనపు కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కిరణ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా కొత్త వెంకోజీపాలెం గ్రామస్తులు 15వ వార్డులో ఉన్న శ్మశానవాటికను వినియోగించుకుంటున్నారన్నారు. అయితే నేటికీ ఈ శ్మశానవాటికకు సరైన రోడ్డు మార్గం లేదన్నారు. దీంతో పలు సందర్భాల్లో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక రోడ్డును ఆధునికీకరించాలని, ఆ మార్గంలో పెరిగిపోయిన పొదలను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సంఘం నాయకులు సూరిశెట్టి సిమ్మినాయుడు, మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతవాక కూడలిలో వాహనాల రద్దీ



హనుమంతవాక కూడలి వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఆరిలోవ : జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి నిత్యం రద్దీగా మారింది. నగరంలో అన్ని రకాల వాహనాల వినియోగం పెరగడంతోపాటు అవసరాల కోసం రాకపోకలు చేసే వారి సంఖ్య కూడా పెరిగింది. ఇక్కడ జాతీయ రహదారి కూడలి కావడంతోపాటు ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రహదారి దీనికి అనుసంధానమై ఉంది. దీంతో ఓ పక్క జాతీయ రహదారిపై నుంచి రాకపోకలు సాగించే వాహనాలతోపాటు బీఆర్‌టీఎస్‌లో ఆరిలోవ, సింహాచలం, పెందుర్తి వైపు నుంచి వచ్చిపోయే వాహనాలతో నిత్యం ఈ కూడలి రద్దీగా ఉంటుంది. ఈ కూడలిలో సిగ్నల్ పడితే వాహనాలు వందల సంఖ్యలో బారులు తీరుతున్నాయి. ఉదయం 8 నుంచి 10 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు మరింత రద్దీగా ఉంటోంది. ఆయా సమయాల్లో వాహనచోదకులు ఈ కూడలి దాటాలంటే కనీసం పది నిమిషాలైనా ఓపిక పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూ క్యాంపస్ : గుండె ఆగినపుడు మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్త ప్రసరణ మెరుగుపరచడానికి, ప్రాణాలు రక్షించేందుకు కార్డియోపల్మనరీ రిసిటేషన్ (సీపీఆర్) ఉపయోగపడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాన్ని సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబులెన్స్‌లలో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్(ఏఈడీ) అవసరాన్ని వివరించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ సీపీఆర్‌పై పౌరులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా సీపీఆర్ శిక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఆర్ శిక్షకుడు రహమతుల్లా ప్రత్యక్షంగా తర్ఫీదు అందించారు. ప్రథమ చికిత్స ట్రైనర్ డాక్టర్ పి.రామారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ బాల సతీష్, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ పట్నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థలాలపై హక్కులు కల్పించాలని ఆందోళన



భానునగర్ కాలనీ వాసులతో వీఆర్‌వోలు

మద్దిలపాలెం : భానునగర్‌లో వీఆర్‌వోలు సోమవారం సర్వే చేశారు. హెచ్‌బీ కాలనీ నుంచి పాత వెంకోజీపాలెం వరకు 1980లో చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి అప్పట్లో భానునగర్‌లో లే అవుట్ వేసి ప్లాట్లు కేటాయించారు. అయితే అవి 22ఏలో వుండడంతో స్థల యజమానులు అమ్ముకునేందుకైనా, రుణాలకైనా వీలు కాకుండా పోయింది. రెవెన్యూ సదస్సులో కాలనీ వాసులు అధికారులకు వినతిపత్రం ఇవ్వడంతో కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఆర్‌ఐలు వచ్చి ఇప్పటికి 4 సార్లు సర్వే చేశారు. సర్వే చేసినప్పుడల్లా ఇది ప్రభుత్వ భూమి కాదని... త్వరలోనే కాలనీ వాసులకు హక్కులు కల్పిస్తామని హామీలిచ్చి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం వచ్చిన వీఆర్‌వోల ఎదుట స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలతో కాలం వెళ్లదీస్తున్నారు తప్ప తమ స్థలాలపై హక్కులు మాత్రం కల్పించడం లేదని వాపోయారు. హక్కులు కల్పించకపోతే ఆందోళన చేస్తామని కాలనీ అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్, లాజరస్, ఒమ్మి నాయుడు పేర్కొన్నారు.

నేర్చుకునేతత్వం అలవరచుకోవాలి

ఎంవీపీ కాలనీ : ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో కోర్ కంపెటెన్సీస్ డవలప్‌మెంట్ అంశంపై వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని బీస్కూల్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు మాట్లాడారు. విద్యార్థి నుంచి ఆచార్యుడు వరకు అంతా నేర్చుకునేతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఇలాంటి వర్క్‌షాపుల ద్వారా బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు నాయకత్వ లక్షణాల పెంపుతోపాటు సమయానుకూల నిర్ణయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఐఐఏఎం కార్యదర్శి డాక్టర్ సుంకరి రవీంద్ర, బీస్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ మేనేజీరియల్ ఎఫెక్టివ్‌నెస్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్, నైపుణ్యాల పెంపుపై అవగాహన పెంచేందుకు ఐఐఏఎం బీస్కూల్, విశాఖపట్నం నావల్ డాక్‌యార్డ్ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 రోజుల పాటు వర్క్‌షాప్ లక్ష్యాలకు అనుగుణంగా ట్రైనింగ్ సెషన్స్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో కమాండర్ అదేష్‌పల్ సింగ్, హెచ్‌పీసీఎల్ సీతఈవో ఇమ్తియాజ్ అర్షద్, ఉజ్వల్ కుమార్ పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సిబ్బంది సమయపాలన పాటిస్తూ, విధులకు హాజరు కావాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఆయన ఆకస్మికంగా పలు విభాగాలను తనిఖీ చేశారు. విభాగాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోవడం ఆయన దృష్టికి వచ్చింది. కార్యాలయ పనివేళల్లో సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని సూచించారు. పరిపాలనా భవనంలోని పలు కార్యాలయాల్లో సిబ్బంది అంతంతమాత్రంగా ఉండడం, పలువురు విధులకు ఆలస్యంగా హాజరుకావడం ఆయన దృష్టికి వచ్చింది. సంబంధిత కార్యాలయం సూపరింటెండెంట్లు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీఎస్‌టీతో వినియోగదారులకు నేరుగా ప్రయోజనాలు

ఏయూ క్యాంపస్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ 2.0తో వినియోగదారులకు నేరుగా ప్రయోజనాలు, లాభాలు చేరుతున్నాయని అమెజాన్ బజార్ ప్రాడక్ట్ బిజినెస్ హెడ్ సమీర్ లాల్వానీ అన్నారు. సోమవారం బీచ్‌రోడ్డులోని వెల్‌కం హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో వార్షికంగా 22 శాతం వృద్ధి చూశామన్నారు. నూతనంగా అమెజాన్ బజార్‌ను ప్రారంభించామని, అందులో రూ.600 కంటే తక్కువ ధరకే 2 కోట్లకు పైగా ఉత్పత్తులు ఉన్నాయన్నారు. వీటిలో 75 శాతం ఉత్పత్తులు కేవలం రూ.300 కంటే తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 23 వేలకు పైగా విక్రేతలు తమ ఉత్పత్తులను అమెజాన్‌తో విక్రయిస్తున్నారన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలి



హెల్త్‌సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు కల్పించే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ డిస్పెన్సరీని సోమ వారం ఆయన సందర్శించారు. నూతనంగా నియమితులైన వైద్య, ఫార్మసీ, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. ప్రతీ విద్యార్థికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లో ఉన్న వసతులు, అందిస్తున్న సేవలు పరిశీలించారు. సాధారణ వైద్యులతోపాటు ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించడానికి అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ రామేశ్వర తెలిపారు. ఏయూ వైద్యశాలలో అందుబాటులో ఉన్న ఔషధాలను వీసీ పరిశీలించారు. అదనంగా ఏమి అవసరమైనా తెలియజేయాలని, వాటిని కొనుగోలుచేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. దివ్యాంగులు సైతం సులభంగా వచ్చేవిధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఏయూ మహిళా హాస్టళ్లలో వైద్యులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్త పరీక్షలు జరిపే పరికరాల కొనుగోలుకు కొటేషన్లు 24 గంటల్లో సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అదనంగా అంబులెన్స్, ఎక్స్‌రే యూనిట్, ఈసీజీ యూనిట్, ఫిజియోథెరపీ పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, డాక్టర్.రామేశ్వరమూర్తి, ఆచార్య శర్మ, ఆచార్య ఈశ్వర కుమార్, ఆచార్య సుభాషిణి, డీఆర్ సాంబమూర్తి, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే పెదగదిలి కూడలి చెరువే



పెదగదిలి కూడలిలో చేరిన వర్షం నీరు

ఆరిలోవ : చిన్నపాటి వర్షం కురిసినా బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి చెరువుగా మారిపోతోంది. ఈ కూడలిలో కొండవాలు వైపు పల్లంగా ఉండడంతో వర్షం నీరు చేరి నిలిచిపోతోంది. కొండవాలు నుంచి నీరు కాలువల ద్వారా వచ్చి పెదగదిలి గెడ్డలో కలుస్తుంది. ఇక్కడ పల్లంగా ఉండడంతోపాటు కొండవాలు నుంచి వచ్చే వరద నీరు ఇక్కడి కాలువల నుంచి కిందకు సరిగా వెళ్లడం లేదు. దీంతో వరద నీరు ఇక్కడ కొంతసేపు నిలిచిపోతోంది. వర్షం కురిసిన ప్రతిసారీ ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంటోంది. సోమవారం ఉదయం కురిసిన వర్షానికి కొండవాలు నుంచి వచ్చిన వరద నీటితో ఈ కూడలి చెరువుగా మారింది. ఈ నీటిలో వాహనచోదకులు వాహనాలు నడపడానికి ఇబ్బంది పడ్డారు. ఈ సమస్య కొన్నేళ్లుగా ఉన్నా జీవీఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు, వాహనచోదకులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

తీరంలో పైపుల రక్షణకు చర్యలు



పొక్లెయిన్‌తో పైపు వద్ద చదును చేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్ : సాగరతీరంలో గతంలో మురుగు నీటి ప్రవాహానికి వీలుగా నిర్మించిన కల్వర్టు దెబ్బతినడంతో అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. తీరంలో వచ్చే భారీ కెరటాల తీవ్రతకు కింది భాగంలో ఉన్న ఇసుక కోతకు గురవడంతో సిమెంట్ పైపులు పూర్తిగా పక్కకు ఒరిగిపోయాయి. దీనిపై సాక్షిలో కథనం ప్రచురితమవడంతో అధికారులు సరిదిద్దుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా ఈ ప్రాంతంలో కల్వర్టు నుంచి వేసిన సిమెంట్ పైపుల చుట్టూ ఇసుక వేసే పనులు పొక్లెయిన్‌తో చేపట్టారు. దీనివల్ల తాత్కాలికంగా పైపులను సంరక్షించడం సాధ్యపడుతుంది. తుపాన్లు సంభవించే సమయంలో వచ్చే భారీ కెరటాల ఉధృతికి ఈ ఇసుక కోతకు గురైపోతుంది. అదే జరిగితే పైపులు మళ్లీ పక్కకు ఒరిగిపోతాయి.

కేజీహెచ్‌లో ఫుట్ స్కానింగ్ ప్రారంభం



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: ఫుట్ స్కానింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి అన్నారు. సోమవారం కేజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో ఏపీ మెడిటెక్ జోన్ సహకారంతో వైద్యులకు, పోస్ట్–గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, పాదంలో బరువు ఎలా సమతుల్యంగా ఉందో దీని ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సౌకర్యం ఇంతవరకు హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, కానీ నేటి నుంచి విశాఖలో కూడా ఈ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీ మెడిటెక్ జోన్ ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ ద్వారా ఈ అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం. చంద్రశేఖరం నాయుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. మన్మధరావు, పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీ.ఎస్. చక్రవర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, ఇతర విభాగాల వైద్యులు, పీజీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.